సాక్షి ఒడిశా

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,56,446లు, బంగారం 100 మిల్లీ గ్రాములు, వెండి 32 గ్రాముల 50 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



యువకుడి మృతదేహం స్వాధీనం

8లో

పాఠశాలలకు సెలవు

భువనేశ్వర్: రాష్ట్రంలో వడగాడ్పులతో వేసవి తీవ్రత విపరీతం అవుతోంది. ఈ పరిస్థితుల్లో వడ దెబ్బ వంటి విపత్కర పరిస్థితుల నివారణ దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు ఆకస్మిక సెలవులు ప్రకటించారు. 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 12వ తేదీ బుధవారం నుంచి 16వ తేదీ వరకు నిరవధికంగా సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

'బీడీవోపై చర్యలు తీసుకోండి'



కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు

రాయగడ: విధి నిర్వహణలో తమకు సహకరించకపోవడంతో పాటు దుర్భాషలాడుతున్న రాయగడ బీడీవో లక్ష్మీనారాయణ సాబత్‌పై చర్యలు తీసుకోవాలని రాయగడ సమితి సర్పంచులు, సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు అతనిని బదిలీ చేయాలని కోరుతూ కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సదరు సమితిలో 27 పంచాయతీలు ఉన్నాయని, అయితే పంచాయతీలకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తే స్పందించడం లేదన్నారు. ఆదివాసీలైన కొంతమంది సర్పంచ్‌లను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయించండి




మున్సిపల్ చైర్మన్‌తో మాట్లాడుతున్న హోమియోపతి డాక్టర్లు

జయపురం: నగరంలో హోమియోపతి ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఇంటర్నేషనల్ హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ కొరాపుట్ జిల్లా శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జయపురం మున్సిపాలిటీ చైర్మన్‌ను మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. తమ అసోసియేషన్ గత 52 ఏళ్ల నుంచి ప్రజలకు వైద్య సేవలు అందిస్తోందని వివరించారు. దక్షిణ ఒడిశాలోని కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, నవరంగపూర్ జిల్లాల్లో అసోసియేషన్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇదివరకు 2010లో జయపురం నీలకంఠసాగర్ ఒడ్డున హోమియోపతి ఆస్పత్రి, కార్యాలయ నిర్మాణానికి మున్సిపాలిటీ అధికారులు స్థలం మంజూరు చేశారని వివరించారు. అప్పుడు ఎమ్మెల్యే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో భవనాన్ని నిర్మించామని వెల్లడించారు. ఆ భవనా 2012లో అప్పటి రాష్ట్ర మంత్రి రబి నారాయణ నందో ప్రారంభోత్సవం చేశారన్నారు. అయితే నీలకంఠ సాగర్ అభివృద్ధి నిమిత్తం తమ హోమియో భవణాన్ని కూల్చి వేశారని, మరలా నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కోరారు. అయితే మున్సిపాలిటీలో సంస్థలకు కేటాయించేందుకు ఎటువంటి స్థలం లేదని చైర్మన్ నరేంద్ర మహంతి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థలం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రెడ్ అలెర్ట్

- రాష్ట్రానికి వడగాడ్పుల హెచ్చరిక



భువనేశ్వర్: రాష్ట్రంలో వేడి గాలులతో కూడిన ఎండ తీవ్రత సాధారణ జన జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. ఈ పరిస్థితి మరింత అధికమయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. ఈ నేపథ్యంలో ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రం మారుమూల ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు హీట్ వేవ్ (వడగాడ్పులు) పరిస్థితులు తాండవిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈనెల 14, 15 తేదీల్లో ఝార్సుగుడ ప్రాంతంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. బరిపద, టిట్లాగడ్ ప్రాంతాల్లో ఈనెల 13వ తేదీన ఎండ తీవ్రత అధికమై గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీల సెల్సియస్‌కు తాకే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే భువనేశ్వర్ ప్రాంతంలో గరిష్ట ఉష్ణోగ్రత 41 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుందని స్థానిక వాతావరణ కేంద్రం ముందస్తు అంచనాగా పేర్కొంది. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 3 డిగ్రీల నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా తీవ్రమైన వడగాడ్పులు, ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

బోటింగ్ నియమాలు కట్టుదిట్టం



ప్రమాదకరంగా పడవ ప్రయాణం(ఫైల్)

- లైఫ్ జాకెట్ తప్పనిసరి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: రాష్ట్రంలో బోటింగ్ నియమాలు కట్టుదిట్టం చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలియజేశారు. లోక్‌సేవా భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో పలుమార్లు జరిగిన పడవ ప్రమాదాలపై సమీక్షించారు. దీంతో ఒడిశా పడవ ప్రయాణం నియమాలు-2004 కట్టుదిట్టంగా అమలు చేస్తామన్నారు. నియమాల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 2004 నుంచి ఒడిశా పడవ ప్రయాణం నియమాలను అమలు చేస్తున్నారు. అయితే వీటి అమలు నోచుకోవడం లేదని సమావేశంలో పాల్గొన్న అధికారులు వెల్లడించారు. కట్టుదిట్టంగా పాటించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసినా వాస్తవ కార్యాచరణ శూన్యంగా పరిణమించింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల నిబంధనలపై విస్తతంగా అవగాహన కల్పించాలని, పాటించకుంటే చేపట్టే చర్యల పట్ల చైతన్య పరచాల్సి ఉందని అధికారులు ప్రతిపాదించారు.

లైఫ్ జాకెట్లు వినియోగించాలి


రాష్ట్రంలో సముద్రాలు, నదులు, సరస్సులు, జలాశయాలు (రిజర్వాయర్లు) మొదలైన వాటిలో పర్యటన లేదా రవాణా కోసం ప్రయాణికులు లైఫ్ జాకెట్లు వినియోగించడం తప్పనిసరి అని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఆపత్కాల పరిస్థితుల్లో ఆకస్మిక సహాయక, పునరుద్ధరణ చర్యల కోసం లైఫ్ బాయ్‌లను అనుబంధ పరికరాలతో (ఫ్లోటింగ్ లైఫ్-సేవింగ్ డివైజ్‌లు) పడవలలో అందుబాటులో ఉంచడం అనివార్యంగా పేర్కొన్నారు. పడవ నడిపే వారు, పర్యాటకులు, ప్రయాణికులతో ఈ సిబ్బంది లైఫ్ జాకెట్లు ధరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ అవసరం

ప్రయాణికుల పడవలు, సరుకు రవాణా పడవలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పడవ ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకుండా చట్టపరమైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయనున్నారు. ఘాట్ వేలం సమయంలో బోట్ మెన్‌లు నిబంధనలు పాటిస్తున్నారో లేదో తెలియజేయాలని, ఈ విషయమై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పంచాయతీరాజ్ శాఖకు ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణించవద్దని, బోట్ లేదా లాంచ్ ఆపరేటర్లు ప్రయాణికులను అభ్యర్థించాలి. బోటు లైసెన్సులు జారీ పురస్కరించుకుని అనుబంధ వర్గాలకు భద్రతా చర్యలు చేపట్టడంపై అవగాహన కల్పించడం బాధ్యతాయుతంగా పరిగణించాలని వాణిజ్య, రవాణా శాఖకు ప్రత్యేకంగా ఆదేశించారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

- రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా



భువనేశ్వర్: రాష్ట్రంలో కోవిడ్ సంక్రమణ క్రమంగా పెరుగుతోందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. ప్రస్తుతం కోవిడ్ పాజిటివ్ రోగుల సంఖ్య అదుపులో ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం మొత్తం కోవిడ్ కేసులు పెరుగుతున్న సంకేతాలు తారసపడుతున్నాయి. ప్రస్తుతం 16 జిల్లాల్లో కోవిడ్ కేసులు ఉన్నట్లు ధ్రువీకరించారు. రాష్ట్రంలో సోమవారం 141 మందిలో కోవిడ్ పాజిటివ్ గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 731కి చేరుకుందన్నారు. వీరిలో 18 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జాతీయ స్థాయిలో కోవిడ్ పాజిటివిటీ రేటు 6.9 కొనసాగుతుండగా, రాష్ట్రంలో ఈ రేటు 2.8కి పరిమితమైందని వెల్లడించారు.

టీకాల కోసం కేంద్రానికి లేఖ

కోవిడ్ వ్యాక్సిన్ కోసం రాష్ట్ర ఆరోగ్య శాఖ కేంద్రానికి లేఖ రాసినట్లు రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ్ పాణిగ్రాహి తెలిపారు. రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 50 వేల వ్యాక్సిన్ల కోసం కేంద్రానికి లేఖ రాశారు. అప్రమత్త చర్యల్లో భాగంగా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడం తప్పనిసరి చేసే నిబంధనపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. మాస్క్ ధారణతో విస్తృత సంక్రమణకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. అయితే రాష్ట్రంలో సంక్రమణ సంకేతాలు బలపడుతున్నా, ప్రమాదకర పరిస్థితుల జాడ లేనట్లు తెలిపారు. చికిత్స కోసం ఐసీయూలో చేరే పరిస్థితులు ఇంత వరకు పునరావృతం కాలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరోనా కదలికపై ఆరోగ్య శాఖ అనుక్షణం నిఘా వేసి ఉంటుందన్నారు. లోగడ సరఫరా చేసిన టీకాల నిల్వలు పూర్తయ్యాయని వెల్లడించారు. జనవరి నెలలో పంపిణీ చేసిన టీకాల నిల్వ ఫిబ్రవరి 8వ తేదీతో పూర్తైనట్లు తెలిపారు. రాష్ట్రంలో 98 శాతం మంది కోవిడ్ మొదటి టీకా, 91 శాతం మంది రెండో టీకా, 41 శాతం మంది బూస్టర్ డోస్ తీసుకున్నట్లు ప్రకటించారు.

గంజాయి స్వాధీనం



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు



బరంపురం: వాహనంతో పాటు అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో పోలీసులు భారీ ఎత్తున గంజాయిని పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ఆదేశానుసారం ఒక స్పెషల్ స్క్వాడ్ గుడరి పోలీసుస్టేషన్ పరిధిలోని సుకుడు బాజు అటవీ ప్రాంతంలో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 3.2 క్వింటాళ్ల గంజాయి లభించినట్లు గుడారి ఐఐసీ దీనబంధు సాబొరా తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.30.20 లక్షలు ఉంటుందని అంచనా. కేసుకు సంబంధించి 5 గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు గుణుపూర్ కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో గుడారిలోని రంభి గ్రామానికి చెందిన మాల దకపకస్క((45), మంగుళు దకపకస్క (30), కద్రక రాజ (29), శ్యామ మంబాలక (40), పూర్ణ కుడుకక (40) ఉన్నట్లు గుర్తించారు.

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 25 కిలోల గంజాయిని సురడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి కౌసిక్ మజ్జి తెలిపిన వివరాల మేరకు.. బరంపురం నగరానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న సమయంలో ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు దరింగబడి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానంతో బొలేరోలో సోదాలు నిర్వహించగా 25 కిలోల గంజాయి బస్తా బయటపడింది. దీంతో వాహనంతో పాటు డ్రైవర్‌ని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగులకు సత్కారం



సిబ్బందిని సత్కరిస్తున్న జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

భువనేశ్వర్: విధి నిర్వహణలో అప్రమత్తతో వ్యవహరించి, ప్రమాదాలు నివారించిన ఎనిమిది మంది సిబ్బందికి ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం ప్రత్యేకంగా సత్కరించారు. వీరిలో సురేంద్ర బంచర్ (నౌపడ స్టేషన్ సూపరింటెండెంట్), ఎం.సూర్యనారాయణ (ట్రాక్‌మెన్ బిసంకటక్), బీపేంద్ర మహానంద (టీపీఎం 'ఎ' బిసంకటక్), వినయ కుమార్ మిశ్రా (టీపీఁ 'బీ' ఖరియార్ రోడ్), సురేంద్ర కుమార్ బెహరా (ట్రాక్‌మేన్-1 సోంపేట), ప్రదీప్ కుమార్ నాయక్ (టీపీం 'ఎ' హరిచందన్‌పూర్), శ్రీధర్ సాహు (ట్రాక్‌మెన్-4 బుడామల్), పి.శ్రీనివాసరావు (పార్వతీపురం స్టేషను సూపరింటెండెంట్)లు ఉన్నారు. ఈ సందర్భంగా మనోజ్‌శర్మ మాట్లాడుతూ.. నిరంతరం రైళ్ల బోగీలు, పట్టాలపై పరిస్థితులను పరిశీలిస్తూ, అనుబంధ యంత్రాంగానికి సకాలంలో సమాచారం చేరవేస్తూ ఉద్యోగులు అంకితభావం చాటుకున్నారని అభినందించారు. కార్యక్రమంలో తూర్పు కోస్తా రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శరద్ కుమార్ శ్రీవాస్తవ్ తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా పనులు



మందకొడిగా జరుగుతున్న అభివృద్ధి పనులు



- శ్రీ మందిరం పరిసరాల్లో రాకపోకలకు ఇబ్బందులు

భువనేశ్వర్: ఈ ఏడాది జరగనున్న శ్రీజగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతోంది. కానీ శ్రీమందిరం నాలుగు వైపుల అభివృద్ధి పనులు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. పరిసరాల్లో తవ్వకాలతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. సింహద్వారం, ఉత్తర, పడమర, దక్షిణ ద్వారాలు, ఆలయ ప్రాకారం చుట్టూ గతుకులు, గుంతలతో నడక దారి కనుమరుగైంది. శ్రీమందిరం రాకపోకలకు తలెత్తిన ఇబ్బందికర పరిస్థితులతో ప్రాతః కాల సేవాదులతో ఇతర కార్యకలాపాల్లో జాప్యం చోటు చేసుకుంటుందని అనుబంధ వర్గాల ఆరోపణ. అందువలన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పలువురు సూచిస్తున్నారు.

మమ్మేలు మా బుడి శాంతమ్మ



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరిన మహిళలు



వేషధారణల్లో ఆకట్టుకుంటున్న చిన్నారులు



అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు సిద్ధంత్ మహాపాత్రో



దీపారాధనలు చేస్తున్న భక్తులు



ఘటయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పూజార్లు

దక్షిణ ఒడిశాకి ప్రసిద్ధి చెందిన మా బుడి శాంతమ్మ సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన మంగళవారం రోజు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం 5 గంటల ప్రాంతంలో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక ఏకాంత పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయం ఎదురుగా ఉన్న ధర్మ జెండాకి భక్తులు పంచామృతాలు, పానకాలతో పూజలు చేసి చల్లదనం చేశారు. పిండి వంటలను నైవేద్యంగా పెట్టారు. సాయంత్రం అమ్మవారి తాత్కాలిక ఆలయ ప్రాంగణంలో సంబరాల నిర్వాహకులు పాతర్ల దుర్గా ప్రసాద్ దేశిబెహరా సతీమణి పాతర్ల రేవతి అమ్మవారి ప్రధాన ఘటంతో బయల్దేరడంతో రాజుగారి కోటా, చిన్న బజార్, సంత్రాని వీధి, లాలావీధి, కొత్తవీధి, బొందొవీధి, బాలాజీ పెంటొ, కపిలేశ్వర్ పెటా, కుమ్మరి వీధి, కేవుటి వీధి గుండా ఘటయాత్ర సాగింది. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో స్థానిక దేశి బెహరా వీధిలోని తాత్కాలిక ఆలయానికి చేరుకున్నారు. ఘట యాత్రలో వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- బరంపురం

క్లుప్తంగా

చైతన్య రథం ప్రారంభం



చైతన్య రథం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ త్రినాథ్ మాఝి

మల్కన్‌గిరి: జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అదనపు కలెక్టర్ త్రినాథ్ మాఝి విద్య చైతన్య రథాన్ని మంగళవారం ప్రారంభించారు. దీని ద్వారా మల్కన్‌గిరి, చిత్రకొండ, ఖోయిర్‌పూట్, మత్తిలి, కోరుకొండ, కలిమెల, పోడియా సమితుల్లో గిరిజనుల విద్యకు తోడ్పాటునందించనున్నట్లు పేర్కొన్నారు. గిరిజన తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, చిన్నారుల విద్యకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మానాస్ రంజాన్ జెన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు అరెస్టు

- విద్యార్థిని అపహరణ నేరంపై కేసు



అరెస్టు చేసిన ఉపాధ్యాయుడిని చూపిస్తున్న పోలీసులు

జయపురం: పదో తరగతి చదువుతున్న ఒక బాలికను ప్రేమిస్తున్నానని ప్రలోభపెట్టి, అపహరించిన ఘటనలో నిందితుడైన ఉపాధ్యాయుడిని బిసింగపూర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కాళరగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్చి 20వ తేదీన చంపాపాదర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని కాళరగడ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు వెళ్లింది. అయితే ఆ సమయంలో ఉపాధ్యాయుడు సుబ్రత్ తుషార్ రంజన్ మల్లిక్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి అపహరించుకుపోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై బిజింగపూర్ పోలీసుస్టేషన్ అధికారి సమ్మిత్ కుమార్ స్వైయ్ నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు నిందితుడైన ఉపాధ్యాయుడు సుబ్రత్ తుషార్ రంజన్ మల్లిక్‌ను అరెస్టు చేసి, విద్యార్థినిని రక్షించి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

యువకుడి మృతదేహం స్వాధీనం



యువకుడి మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న తుటిబార్ కాలనీ సమీపంలో ఒక యువకుడి మృతదేహాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. యువకుడు అదే కాలనీకి చెందిన కుమార్ జొడియా (25)గా గుర్తించారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. టికిరిలో గత కొద్దిరోజులుగా అమ్మవారి పండగ జరుగుతోంది. ఈ పండగను చూసేందుకు కుమార్ ఆదివారం రాత్రి వెళ్లాడు. ఆరోజు రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు వెదకడం ప్రారంభించారు. అయితే సోమవారం సాయంత్రం కాలనీకి సమీపంలో మృతదేహం చూసిన స్థానికులు సమాచారం అందించారు. దీంతో తన కొడుకును ఎవరో హత్య చేసి ఉంటారని తండ్రి త్రినాథ్ జొడియా ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

చెట్టును ఢీకొన్న లారీ

బొండపల్లి: మితిమీరిన వేగంతో విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న బెంజ్ లారీ అదుపు తప్పి జాతీయ రహదారి 26 పక్కన గల మామిడి చెట్టును ఢీకొంది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు భారీ ప్రమాదం జరగకుండా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇక లారీ రోడ్డుకు అడ్డంగా జాతీయ రహదారిపై నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని అడ్డంగా నిలిచి పోయిన లారీని భారీ క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

విద్యతో పేదరిక నిర్మూలన

- రాష్ట్ర ఉన్నత విద్యామంత్రి రోహిత్ పూజారి



మాట్లాడుతున్న మంత్రి రోహిత్ పూజారి



వేదికపై ఆశీనులైన నాయకులు, అధికారులు

బరంపురం: ఉన్నత విద్యతో పేదరికం నిర్మూలించవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజరి అన్నారు. స్థానిక శశిభూషన్ రథ్ ఉమెన్స్ కళాశాల 65వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం అంతం చేయాలంటే యువత ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. అనంతరం నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక మంత్రి శ్రీకాంత్ సాహు, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, కేకే విశ్వవిద్యాలయం వీసీ ప్రఫుల్ల మహంతి, కళాశాల ప్రిన్సిపాల్ జన్మచరణ్ పాడి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోహిత్ పూజారి తదితరులు



ఎన్‌సీసీ విద్యార్థినుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రోహిత్ పూజారి

ఆరోగ్యంపై అవగాహన అవసరం



జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్లు తదితరులు

జయపురం: గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన అవసరమని వక్తలు అన్నారు. స్థానిక పూల్‌బెడలోని కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ రామచంద్ర మహంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గైనకాలజిస్టులు దిలీప్ కుమార్ బాక్స్వాల్, అక్షయకుమార్ రథ్, పీడియాట్రిక్ డాక్టర్ అశోక్ కుమార్ మల్లిక్, చర్మరోగ చికిత్స వైద్యుడు డాక్టర్ గంగాధర బెహరలు ప్రసంగించారు. ఆరోగ్యంపై అవగాహనతో మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రి వర్గాలు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని ఆస్పత్రి మేనేజర్ రూపసి నాయిక్, రాజా ప్రధాన్‌లు పర్యవేక్షించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రామచంద్ర

బ్లేడ్‌తో కోసుకున్న వ్యక్తి

వేపాడ: కుటుంబసభ్యులు తాగుడు వద్దారన్న కోపంతో మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన మిరియాల సూరిబాబు మద్యం మత్తులో బ్లేడుతో పీక కోసుకున్నాడు. ఇందుకు సంబంధించి 108 సిబ్బంది, వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సూరిబాబు మూడు రోజులుగా మద్యం మత్తులో ఉండడంతో మంగళవారం తల్లి, భార్య కాంత కుటుంబీకులు తాగుడు తగ్గించమని చెప్పి పెద్దలవద్దకు పిలిపించడంతో మద్యం మత్తులో ఉన్న సూరిబాబు బ్లేడ్‌తో కోసుకోవడానికి ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు ఆపడంతో బయటకు వెళ్లి కోసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు వేపాడ నుంచి హుటాహుటిన చేరుకున్న 108 టెక్నీషియన్ ఎస్.దేముడు పైలెట్ ప్రకాష్ ప్రథమ చికిత్స చేసి ఆక్సిజన్ అమర్చి ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రాజేష్ బ్లేడ్‌తో పీకకోసుకున్న సూరిబాబు వాగ్మూలం నమోదు చేశారు.



108లో సూరిబాబుకు చికిత్స అందిస్తున్న టెక్నీషియన్ దేముడు

పైడితల్లికి పుష్పాలంకరణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నైవేద్యం సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

నిర్లక్ష్యం వహిస్తే.. మిగిలేది బూడిదే..!



- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- ఈనెల 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



గ్యాస్ మంటల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: ఎండా కాలం మండించే కాలం. అధిక ఉష్ణోగ్రతలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. విద్యుదాఘాతం, సిగరెట్, చుట్ట, బీడీ కాల్చి ఆర్పివేయకుండా పడేయడంతో కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే అగ్ని ప్రమాదాలను పక్కన పెడితే మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వేసవిలో అజాగ్రత్తగా ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వాటిని ముందు జాగ్రత్తలతో అరికట్టవచ్చని, తద్వారా ఆస్తి, ప్రాణనష్టాల్ని నివారించవచ్చని అగ్నిమాపక విపత్తుల నివారణ అధికారులు చెబుతున్నారు.

ఏడాదిలో 125 ప్రమాదాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పాలకొండ, పార్వతీపురంలలో అగ్నిమాపక కేంద్రాలుండగా వాటి పరిధిలో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు 125 అగ్ని ప్రమాదాలు జరగ్గా, రూ.79,75,360లు ఆస్తినష్టం సంభవించింది. అలాగే మరికొన్ని అగ్ని ప్రమాదాల్లో రూ.3,28,83,500ల మేర ఆస్తినష్టం సంభవించకుండా కాపాడినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇలా జాగ్రత్తలు పాటిద్దాం..

వంట గ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వేయడం వంటివి చేయరాదు. వెంటనే అగ్ని మాపక అధికారులకు సమాచారం అందివ్వాలి. సిగరెట్, చుట్ట, బీడి వెలిగించిన వారు పడేసేటప్పుడు పూర్తిగా ఆర్పివేయాలి. ఇళ్లను వదిలి వెళ్లే వారు కరెంట్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. దీనివల్ల వేడికి తీగలు షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది. వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గి పెట్టెలు, లైటర్లు, ఒత్తి దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి. అగ్ని ప్రమాదం ఇళ్లలో, షాపుల్లో సంభవించినప్పుడు తలుపులు మూసి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. లేదా 101కు ఫోన్ చేయాలి. అగ్ని ప్రమాదం వల్ల అతిగా పొగ వెలువడి ఊపిరి అందదు. ఆ సమయంలో మంటల నుంచి తప్పించుకోవడానికి నేల మట్టాన్ని తాకుతూ బాధితులు ముందుకు వెళ్లాలి. దీనివల్ల ప్రమాద తీవ్రత నుంచి తప్పించుకోవచ్చు.

14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

అగ్ని ప్రమాదాల నివారణ పట్ల ప్రజలు, విద్యార్థులను చైతన్య పర్చేందుకు ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలను ఆ శాఖ అధికారులు నిర్వహిస్తుంటారు. 1944వ సంవత్సరంలో ముంబై జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది చనిపోవడంతో వారి జ్ఞాపకార్థం సంతాప దినాలు పాటిస్తూనే వారిలా మరెవరూ అగ్నిప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోకూడదన్న ఉద్దేశంతో అగ్నిమాపక వారోత్సవాలు ఏటా నిర్వహిస్తున్నామని అగ్నిమాపక శాఖ అధికారులు వివరిస్తున్నారు.

> **అజాగ్రత్తతోనే ప్రమాదాలు**
>
> వేసవి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. సరైన సమయంలో సమాచారం చేరవేస్తే, ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడానికి వీలుంటుంది.
>
> – డి.శ్రీరాములు, అగ్నిమాపక కేంద్రం అధికారి (ఎఫ్ఏసీ), గుమ్మలక్ష్మీపురం

విజయానికి మహిళలు వారధిగా నిలవాలి



సమావేశంలో పాల్గొన్న బీజేడీ మహిళా నేతలు

జయపురం: రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి మహిళలు వారధిగా నిలవాలని కొరాపుట్ జిల్లా బీజేడీ పర్యవేక్షకురాలు మీరా పరిడ పిలుపునిచ్చారు. కోట్‌పాడ్ నియోజకవర్గం దమణహండి గ్రామంలో మహిళా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మహిళా కార్యకర్తలు ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. సమష్టిగా పనిచేస్తే విజయం తప్పకుండా సాధిస్తామని తెలియజేశారు. కోట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మిణీ దియాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొరాపుట్ జిల్లా బీజేడీ మహిళా అధ్యక్షురాలు పార్వతీ మస్థి, రీతా పాణిగ్రహి, తులసీ కిర్మాణి, కనకలత పెంటియ, జిల్లా పరిషత్ సభ్యులు గీతా మఝి, త్రిపతి చలాన్, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ఉపాధ్యక్షుడు దురుపుద గదబ, కోట్‌పాడ్ సమితి అధ్యక్షురాలు కమల భొత్ర, ఉపాధ్యక్షులు బాబులి పాణిగ్రహి, సుధీర్ మహంతి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర మఝి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పనుల్లో అవినీతి



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

- కాంగ్రెస్‌పై బీజేపీ ఆరోపణ

జయపురం: పట్టణంలోని చారిత్రక జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని బీజేపీ ఆరోపిస్తూ మంగళవారం నిరవధిక ధర్నా చేపట్టింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ నేతృత్వంలో పలువురు బీజేపీ కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పనుల్లో జరుగుతున్న అవినీతిలో కాంగ్రెస్‌కు ప్రధాన పాత్ర ఉందని ఆరోపించారు. ఇదివరకే శనివారం ఆందోళన నిర్వహించామని, అయితే మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ధర్నా చేపట్టామని వెల్లడించారు. జయపురం ఎమ్మెల్యే అవినీతి అధికారులకు అండగా ఉండడం వలనే అవినీతి విలయతాండవం చేస్తోందని ఆరోపించారు. అవినీతిపై దర్యాప్తు జరపకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

జీసీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చర్యలు

- స్థల పరిశీలన చేసిన అధికారులు



స్థల పరిశీలన చేస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, జీసీసీ డీఎం మహేంద్ర

పార్వతీపురంటౌన్: జీసీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పరిధిలో గల వెంకంపేట పంచాయతీ యర్రా కృష్ణమూర్తి నగర్‌లో గల జీసీసీ స్థలాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీసీసీ డివిజనల్ బ్రాంచ్ ఆఫీస్ డీఆర్స్ గొడౌన్ నిమిత్తం ప్రతిపాదనలు జీసీసీ ఎం.డికి పంపామన్నారు. పార్వతీపురం జిల్లాలో గిరిజనులు సేకరించే అటవీ ఫలాసాయాల వేల్యూ ఆడిషన్ కింద తయారు చేసి ఆ ఉత్పత్తులను బయట మార్కెట్లో విక్రయిస్తే గిరిజనులకు గిట్టుబాటవుతుందన్నారు. ప్రస్తుతం గిరిజనులు సేకరించే అన్ని అటవీ వ్యవసాయ చిరు ధాన్యాలకు మంచి గిరాకీ ఉందని అందరూ ఆర్గానిక్ ఉత్పత్తులనే వాడుతున్నారన్నారు. అందుకు తగ్గట్టుగా రిటైల్ మార్కెటింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని, అందుకు అవసరమయ్యే కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జీసీసీ అభివృద్ధి కోసం ప్రాజెక్ట్ ఆఫీసర్, డిప్యూటీ సీఎం రాజన్నదొర సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా ప్రయాగుల పైడిరాజు, కార్యదర్శిగా నరసింహులు



ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీశివ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఈ మేరకు నూతన కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రయాగుల పైడిరాజు, కార్యదర్శిగా ఎ.నరసింహులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.భానుప్రసాద్ ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా భరద్వాజ్ చక్రవర్తి వ్యవహరించే ఈ కమిటీలో వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎ.కిశోర్, వి.బాబ్జీ, జాయింట్ సెక్రటరీలుగా జీవీఎస్ఎన్ మూర్తి, పి.రవికుమార్, కోశాధికారిగా ఎస్.శంకరరావుతో పాటు వివిధ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి మరో 8 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, విజయనగరం ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు జీవీప్రసాద్, ఎలిశెట్టి సురేష్‌కుమార్, వీఎంకే లక్ష్మణరావు, వైఎస్‌పంతులు, టి.రాధాకృష్ణ, వేదుల సత్యనారాయణ, ఎం.భరత్‌కుమార్ పాల్గొన్నారు.

12 మద్యం సీసాల పట్టివేత



వేపాడ: పట్టుబడిన వ్యక్తి, మద్యం సీసాలతో ఎస్సై రాజేష్, సిబ్బంది



నెల్లిమర్ల రూరల్: పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

వేపాడ: మండలంలో నీలకంతరాజపురం పంచాయతీ భర్తవానిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 12 మద్యం బాటిల్స్ పట్టుబడినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కొల్లి బంగారయ్య వద్ద పట్టుబడిన మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పా రు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సతివాడలో బెల్టు షాపుపై దాడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపుపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సతివాడ జంక్షన్‌లో గల టీ టైం సమీపంలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటూ వచ్చిన ముందస్తు సమాచారంతో ఎస్సై నారాయణరావు, సిబ్బంది దాడులు నిర్వహించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. షాపులో ఉన్న 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించామని ఎస్సై నారాయణరావు తెలిపారు.



పూసపాటిరేగ: స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై నారాయణరావు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల(పూసపాటిరేగ): పూసపాటిరేగ మండలంలోని గోవిందపురం గ్రామంలో అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎ.నరేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గోవిందపురం గ్రామానికి చెందిన పి.రామకృష్ణ బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. వైన్ షాపు నుంచి బెల్టు షాపునకు మద్యం తరలిస్తుండగా గ్రామ పరిధిలో పోలీసులు పట్టుకుని 47 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా తమకు సమాచారం అందించాలని ఎస్సై నరేష్ కోరారు.

క్లుప్తంగా

కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మోటారు యాక్సిడెంట్ కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీకావటం వల్ల కక్షిదారులకు ఎంతో డబ్బు, సమయం ఆదా అవుతోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. కక్షిదారులకు తక్షణ ఉపశమనం, శాశ్వత పరిష్కారం జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అవ్వటం ద్వారా కలుగుతుందని అన్నారు. కోర్టు ఆవరణలో ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు, మోటార్ యాక్సిడెంట్ కేసుల బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్, మోటార్ యాక్సిడెంట్ కేసులు వాదించే పిటిషనర్ అడ్వకేట్స్‌తో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. మే నెల రెండో శనివారం అనగా 13వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో మోటార్ యాక్సిడెంట్‌కు సంబంధించిన కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, పలు బీమా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొమ్ముకోనేం @ 200 కిలోలు



రింగు వలకు చిక్కిన భారీ కొమ్ము కోనెం చేప

టెక్కలి: సంతబొమ్మాళి మండలం గెద్దలపాడు తీరంలో మంగళవారం సాయంత్రం జాలర్లకు 200 కిలోల కొమ్ము కోనెం చేప దొరికింది. మత్స్యకారులు వేటకు వెళ్లగా రింగు వలకు ఈ చేప చిక్కింది. స్థానిక వ్యాపారులకు రూ.15 వేలకు విక్రయించారు.


ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో మొదటి షిఫ్టులో 99 మందికి 96 మంది, రెండో షిఫ్టులో 99 మందికి 97 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 80 మందికి 79 మంది, రెండో షిఫ్టులో 80 మందికి 75 మంది హాజరయ్యారు.

పదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్న గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించాడు. ఈ వ్యక్తి బాలిక కుటుంబానికి బంధువు కావడంతో తరచూ ఆ ఇంటికి వెళ్లేవాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. రెండు రోజుల కిందట నివాస గృహానికి సమీపంలో వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు గమనించారు. బాలిక చెప్పిన విషయాల మేరకు సోంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కిల్లోయి ఆశ్రమ పాఠశాల విద్యార్థికి గాయాలు



గాయపడిన టి.గోపి

మందస: మండలంలోని కిల్లోయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.గోపి అనే విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనను ఆశ్రమ నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. పలాసకు చెందిన గోపి.. కిల్లోయి ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. హెచ్‌ఎం మదనమోహన్ చెప్పిన ప్రకారం గోపి ఫుడ్ లీడర్‌గా ఉంటున్నాడు. కానీ, బాధితుల ఆరోపణ ప్రకారం వంట పనికి గోపిని నియమించడంతో గంజిలో పడిపోవడంతో చేయికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచి ఉపాధ్యాయులు వైద్యం అందించినప్పటికీ.. చేయి ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. దీంతో బాధిత విద్యార్థిని పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్టు హెచ్‌ఎం మదన్‌మోహన్ చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు ఆశ్రమ పాఠశాలకు వెళ్లి ఘటన పూర్వాపరాలు తెలుసుకున్నారు. విద్యార్థికి సరైన వైద్యం అందకపోవడంతో చేయి ఇన్‌ఫెక్షన్ గురైనట్టు పరిశీలనలో తేలింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చెప్పారు. ఆశ్రమంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. విద్యార్థి గోపికి న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు పి.అరుణ, నాగమణి, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమల ప్రభాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వేటకు విరామం

- ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేట నిషేధం
- ఆ సమయంలో మత్స్యకారులకు అండగా వైఎస్సార్ మత్స్యకార భరోసా
- అర్హత కలిగిన కుటుంబానికి రూ.10 వేలు చొప్పున భృతి
- నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వ రాయితీలు రద్దు



మంచినీళ్లపేట తీరంలో లంగరు వేసిన బోట్లు

అరసవల్లి/వజ్రపుకొత్తూరు: సముద్రంలో చేపల వేటకు ప్రభుత్వం విరామం ప్రకటించింది. చేపల సంతానోత్పత్తి సమయం కావడంతో ఈ నెల 15(14వ తేదీ అర్ధరాత్రి) నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు వేట నిషేధం సమయంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు నెలలూ ప్రాదేశిక సముద్ర జలాల్లో మెకనైజ్డ్, మోటారు బోట్లు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ, కోస్టల్ గార్డ్స్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నారు. నిషేధ కాలంలో తీర ప్రాంత మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట రూ.10 వేలు చొప్పున పరిహారాన్ని అందజేయనుంది. గత ఏడాది వేట నిషేధ భృతి కింద జిల్లాలో మొత్తం 14043 మంది లబ్ధిదారులకు అందజేశారు.

జిల్లాలో వేట బోట్లు 4182..

జిల్లాలో శ్రీకాకుళం, గార, నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం తదితర 11 మండలాల్లో మొత్తం 60 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. వేటకు వినియోగించే మోటరైజ్డ్ బోట్లు 1530, నాన్ మోటరైజ్డ్ బోట్లు (సంప్రదాయ పడవలు) 2652 కలిపి మొత్తం 4182 బోట్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం మోటరైజ్డ్ బోటుకు ఆరుగురు చొప్పున, నాన్ మోటరైజ్డ్ బోటుకు ముగ్గురు చొప్పున మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ప్రభుత్వం తరఫున రూ.10 వేలు చొప్పున భృతి అందనుంది. ఈ లెక్కన ఈ ఏడాది జిల్లాలో 17,136 మంది వరకు మత్స్యకారులకు లబ్ధి చేకూరే అవకాశముంది. ఇందులో ఒకే రేషన్ కార్డు కిందకు వచ్చే వారితో పాటు ఇతరత్రా అనర్హతలున్న వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తప్పించనున్నారు. ఈ ప్రక్రియ తర్వాతే తుది జాబితా ప్రకటిస్తారు. వేట నిషేధ సమయంలో నిబంధనలు అతిక్రమించిన మత్స్యకారులకు ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1995, సెక్షన్ 4 ప్రకారం శిక్ష తప్పదు. అతిక్రమించిన బోట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానా విధిస్తారు. ప్రభుత్వం తరఫున అన్ని రాయితీలను రద్దు చేస్తారు.

మత్స్యకార భరోసా అర్హతలివే...

- మార్చి 31, 2023 నాటికి లబ్ధిదారుని వయస్సు 18–60 మధ్య ఉండాలి.
- వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలకు మించరాదు.
- పల్లం భూమి 3 ఎకరాలు, మెట్టు భూమి 10 ఎకరాలకు మించి ఉండరాదు..
- లబ్ధిదారుని పేరిట కారు, జీపు తదితర నాలుగు చక్రాల వాహనాలు రిజిస్టరై ఉండకూడదు.
- గృహావసరాలకు వాడుతున్న విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటరాదు.
- పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి ఖాళీ స్థలం ఉండకూడదు. ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులుగా గుర్తిస్తారు.
- లబ్ధిదారుని కుటుంబంలో ఏ ఒక్కరూ ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులుగా ఉండరాదు. ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో నమోదైన వారు ఉండరాదు.

రూ.10వేలు జమ చేస్తున్నారు..



జగన్ సీఎం అయ్యాక వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏటా రూ.10వేలు ఖాతాలో వేస్తున్నారు. గతం లీన్ మంత్స్ పేరుతో తాము కొంత డిపాజిట్ చేస్తే వారు కొంత కలిపి ఇచ్చేవారు. అది కూడా ఎప్పుడో ఒకసారి ఇచ్చేవారు. ఇదికాక వలలు, డీజిల్ ఆయిల్, ఐస్ బాక్స్‌లను ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తోంది.

– సౌదాల వల్లరావు, మత్స్యకారుడు, దేవునల్తాడ

17న వివరాలు నమోదు...



మత్స్యశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ల ఆదేశాల ప్రకారం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకానికి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఈ నెల 17న జిల్లాలో ఉన్న అన్ని ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో ఎన్యూమరేషన్ సిబ్బంది నమోదు చేస్తారు. అర్హులైన వారు పేర్లు నమోదు చేయించుకోలి. వేట నిషేధ కాలంలో ఎవరైనా నిబంధనలకు అతిక్రమిస్తే ప్రభుత్వ రాయితీలను రద్దు చేస్తాం.

– పి.వి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా మత్స్యశాఖ

భర్తను చంపించిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ఘాతుకం
- భార్యతో పాటు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి సీఐ పైడయ్య

లావేరు: వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని భర్తను ఓ భార్య హత్య చేయించింది. ఈ ఘటనలో మృతుడి భార్యతో పాటు మరో ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జేఆర్‌పురం ఇన్‌చార్జి సీఐ పి.పైడయ్య, లావేరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మురపాక గ్రామానికి చెందిన గణమాన రాము(42), కుమారి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. దంపతులిద్దరూ భవన నిర్మాణ పనులు చేస్తుండేవారు. కుమారి శ్రీకాకుళం పట్టణానికి చెందిన దారపు ప్రసాద్ వద్దకు కూలి పనులకు వెళ్లేది. ఈ క్రమంలో ఇద్దరికీ వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో మందలించాడు. తనను అనుమానిస్తున్నాడని, ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని కుమారి విషయాన్ని తన ప్రియుడు ప్రసాద్‌కు చెప్పింది. ఈ క్రమంలో ప్రసాద్ తన స్నేహితులు సతీష్‌కుమార్, కిరణ్‌ల సాయంతో గత నెల 31న రామును హత్య చేసేందుకు బయ్యన్నపేట జంక్షన్ వద్ద మాటు వేశారు. ఆ రోజు రాము రాకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. మరుసటి రోజు వేకువజామున రాము ద్విచక్ర వాహనంతో వస్తుండగా ప్రసాద్, సతీష్‌కుమార్‌లు మరో బైకుతో పెదరావుపల్లి గెడ్డ సమీపంలో బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో రాము కిందపడిపోవడంతో ప్రసాద్ ఈడ్చుకొని వెళ్లి సతీష్‌కుమార్ సాయంతో గొంతు నులిమి చంపేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ నెల 10న పోస్టుమార్టం నివేదికలో హత్యగా తేలడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. టెక్నికల్, ఇతర అంశాల ఆధారంగా శ్రీకాకుళానికి దారపు ప్రసాద్, కొంౖద సతీష్‌కుమార్, బాగు కిరణ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. విచారణలో సీఐ, ఎస్‌ఐతో పాటు లావేరు హెచ్‌సీలు రామారావు, రాజు, పీసీలు ధర్మ, రమణ, బ్రహ్మయ్య, చక్రధర్, ఆమదాలవలస క్రైమ్ టీమ్ పీసీలు రాధాకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా పోరు కెరటం 'పైలా'



విప్లవజోహార్లు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: శ్రీకాకుళ సాయుధ పోరాటంలో సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ పైలా వాసుదేవరావు ప్రజా పోరు కెరటమని న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అభివర్ణించారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడులో మంగళవారం పైలా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పైలా స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి విప్లవ జోహార్లతో నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వాసుదేవరావు భారత విప్లవోద్యమ నాయకుల్లో ఒకరని, పీడిత ప్రజల హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేసి 42 ఏళ్ల అజ్ఞాత జీవితంలో మడమతిప్పని మహాయోధుడిగా నిలిచారని కొనియాడారు. న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, పలు పార్టీల నాయకులు పైల అప్పారావు, పల్లేటి నారాయణ, పైల రామారావు, పైల కృష్ణప్రసాద్, బైర కూర్మారావు, కుసుమ, ఈశ్వరమ్మ, హేమావతి, మద్దిల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి వెనుక ఒకరు

- శ్రీకాకుళం తహసీల్దార్ ఇంట విషాదం
- ఒకే రోజు తల్లి, భార్య మృతి
- లావేరులో విషాద ఛాయలు



భార్య పద్మజ



తల్లి దుర్గమ్మ

లావేరు/శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు ఇంటిలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. తహసీల్దార్ స్వగ్రామం లావేరులో మంగళవారం వేకువజామున తహసీల్దార్ తల్లి నిడిగంట్ల దుర్గమ్మ(77) కన్ను మూయగా.. కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన భార్య పద్మజ (55) కూడా గుండెపోటుతో మృతి చెందారు.

లావేరుకు చెందిన వెంకటరావు భార్యాపిల్లలతో శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. ఆయన తల్లి దుర్గమ్మ మాత్రం లావేరులో రెండో కుమారుడు మాజీ జెడ్పీటీసీ త్రినాథ్‌తో కలిసి ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో ఆమె వేకువజామున లావేరులో మృతి చెందారు. ఆ వార్త తెలిసిన వెంటనే తహసీల్దార్ వెంకటరావు లావేరు వచ్చారు. అయితే కాసేపటికే భార్య పద్మజకు ఆరోగ్యం బాగోలేదని ఫోన్ రావడంతో శ్రీకాకుళం వెళ్లి భార్యను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత తల్లి దహన సంస్కారాలకు హాజరయ్యారు. ఆ కార్యక్రమాల్లో ఉండగానే.. భార్య గుండెపోటుతో మృతి చెందిందని ఆస్పత్రి నుంచి సమాచారం అందడంతో ఆయన నిశ్చేష్టులయ్యారు. లావేరు నుంచి శ్రీకాకుళం వెళ్లి భార్య మృతదేహాన్ని కూడా స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఉదయం తల్లి మృతదేహానికి, మధ్యాహ్నం భార్య మృతదేహానికి లావేరు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్, రెవెన్యూ ఉద్యోగులు, పలు పార్టీల నాయకులు, తహసీల్దార్ వెంకటరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తహసీల్దార్ వెంకటరావు లావేరు గ్రామంలో కనకదుర్గ అమ్మవారికి పెద్ద ఆలయాన్ని నిర్మించి ఆలయానికి తల్లి దుర్గమ్మను ధర్మకర్తగా ఉంచారు. ఆమె గతంలో లావేరు ఎంపీటీసీగా కూడా పనిచేశారు. ఒకే రోజు ఇద్దరిని పోగొట్టుకోవడంపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

జిల్లా పర్యాటకానికి యువోత్తేజం

- పర్యాటక రంగంలో యువత భాగస్వామ్యం
- పాఠశాలలు, కళాశాలల్లో యువ క్లబ్‌ల ఏర్పాటు
- విద్యార్థి దశలోనే సంస్కృతి, కళలు, పర్యాటక ప్రదేశాలపై అవగాహన
- ఇప్పటికే 13 యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సిక్కోలు అందాలు ప్రపంచానికి చూపించడానికి పర్యాటక శాఖ యువత సాయం తీసుకోనుంది. జిల్లాలో అన్ని రకాల సందర్శనీయ స్థలాలు 114 వరకు ఉన్నాయి. ఒక పర్యాటకుడు వీటిని సందర్శించాలంటే కనీసం వారం రోజులు పడుతుంది. అయితే వీటి గురించి సమగ్ర సమాచారం ఒకే చోట లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో జిల్లాలో గల వివిధ పాఠశాలల్లో యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు చేసి, వాటి ద్వారా మరింత ప్రచారం చేపట్టాలని జిల్లా పర్యాటక శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా ఇప్పటికే 13 యువ పర్యాటక క్లబ్‌లను ఏర్పాటు చేసింది. వాటిలో ఉన్న విద్యార్థులను జిల్లాలోని సందర్శన ప్రదేశాలను తీసుకెళ్లి అవగాహన కల్పించారు.

తెలిసింది తక్కువే..

ప్రస్తుతం చదువుతున్న చాలామంది విద్యార్థులకు మన జిల్లాలోని భౌగోళిక, చారిత్రక విశేషాలు తెలియవు. ఫలితంగా జిల్లాలో పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే వారి సంఖ్య పెరగడం లేదు. వాస్తవానికి జిల్లాలో 114వరకు పర్యాటక ప్రదేశాలున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విశేషాలు ఉన్నాయి. సరైన ప్రచారం లేకపోవడంతో ఇవి పర్యాటకుల దృష్టిలో పడడం లేదు. అందుకే వీటి గురించి ప్రచారం చేయాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. అందులో భాగంగానే ముందు విద్యార్థులకు వీటి గురించి వివరించి యువ క్లబ్‌ల ద్వారా ఆయా ప్రాంతాలపై ప్రచారం నిర్వహించనున్నారు.

విద్యార్థులకు అవగాహన

సందర్శనీయ స్థలాలకు వెళ్లిన యువ పర్యాటక క్లబ్ విద్యార్థులు తమ సందర్శనలో గుర్తించిన, తెలుసుకున్న విషయాలను తమ తోటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమగ్రంగా వివరించాలన్నది యువ పర్యాటక క్లబ్‌ల లక్ష్యం. ప్రతి నెలా సమావేశం నిర్వహించుకునే ఏం చేయాలన్న దానిపై కార్యాచరణ రూపొందిస్తారు. సంతలతో పాటు గ్రామాల్లో ప్రజలకు, తల్లిదండ్రులకు ఆ పర్యాటక ప్రదేశాల విశేషాలను తెలియజేస్తారు. క్లబ్ సభ్యులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. తద్వారా వారు భారతీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు జిల్లా విశిష్టతపై వారికెంత అవగాహన ఉందో తెలుసుకుని, తద్వారా వారిలో మరింత అవగాహన కల్పిస్తారు.

పర్యాటకుల సంఖ్య పెంచే ఉద్దేశం

ఈ క్లబ్‌ల వల్ల పర్యాటక ప్రదేశాలపై ప్రచారం, అవగాహన పెరిగి పర్యాటకుల తాకిడి పెరుగుతుందని జిల్లా పర్యాటక శాఖ భావిస్తోంది. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల పర్యాటకులు జిల్లాకు రావచ్చని అభిప్రాయపడుతున్నారు. ఇది జరిగితే జిల్లా పర్యాటక ఆదాయం పెరుగుతుంది. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భావ ప్రకటన సామర్థ్యానికి, ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరవ్వడానికి అవసరమైన విషయ పరిజ్ఞానం కూడా విద్యార్థులకు ఉంటుందన్నది అధికారుల అభిప్రాయం.

పర్యాటక క్లబ్‌లతో యువతకు మేలు

పర్యాటక ప్రదేశాల విశిష్టత, ప్రాధాన్యత, భౌగోళిక పరిస్థితులు విద్యార్థులకు తెలియజేయడమే లక్ష్యం. ఇది భవిష్యత్‌లో వారికి అన్ని రకాలుగా ఉపయోగపడుతుంది. మన జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలపైన పిల్లలు, తల్లిదండ్రుల్లోనూ అవగాహన పెరగనుంది. దీని ద్వారా భవిష్యత్‌లో పర్యాటకుల సంఖ్య, తద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో యువ పర్యాటక క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

– నారాయణరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి.

ఇన్నోవేటివ్ ప్రోగ్రాంలో నెలవంక విద్యార్థులకు ప్రశంసలు



నెలవంకలో సర్టిఫికెట్లతో విద్యార్థులు

కవిటి: రాష్ట్రస్థాయిలో నూతన ఆవిష్కరణల రూపకల్పనలో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్నోవేటివ్ ప్రోగ్రాంలో నెలవంక ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇందుకు సంబంధించి 25 మంది విద్యార్థులకు ఎస్‌ఈఆర్‌టీ సౌజన్యంతో యునిసెఫ్ ఈ కార్యక్రమం నిర్వహించినట్టు పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు రామ్మోహనరావు తెలిపారు. మానవ జీవితంలో సాధారణంగా ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ ఈ పాఠశాల బాల బాలికలు చేపట్టిన ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో ఎస్‌ఈఆర్‌టీకి నివేదించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ సర్టిఫికెట్లు అందించారని హెచ్‌ఎం పి.మోహనరావు తెలిపారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య



బావిలో మృతదేహం (ఇన్‌సెట్లో) గురుమూర్తి(ఫైల్)

మెళియాపుట్టి: బావిలో దూకి వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మెళియాపుట్టి మండలం చాపర గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాపర గ్రామానికి చెందిన పట్టపగలు గురుమూర్తి (70), రాంకుమారి భార్యాభర్తలు. రాంకుమారి కొంత కాలం క్రితమే మృతిచెందగా గురుమూర్తి పెద్దకుమారుడు హరిప్రసాద్ వద్ద ఐదేళ్లుగా ఉంటున్నాడు. ఈ ఏడాది జనవరి నుంచి చిన్నకుమారుడు షణ్ముఖరావు ఇంటి వద్ద ఉంటున్నాడు. మంగళవారం గురుమూర్తి ఇంట్లో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. షణ్ముఖరావు ఎప్పుడూ తన తండ్రిని అనరాని మాటలతో హింసించేవాడని, అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి పెద్దకుమార్తె పద్మ చెబుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. కాగా, షణ్ముఖరావును తండ్రి మృతిపై ప్రశ్నించగా.. తన ఇంట్లో ఉండటం ఇష్టం లేకపోయినా అక్క పద్మ తండ్రిని బలవంతంగా తీసుకువచ్చిందని, అందరూ కలిసి తనపై కేసులు పెట్టి వేధించారని చెబుతున్నాడు. ఇద్దరు కుమారుల ఆస్తి గొడవలే వృద్ధుడి ప్రాణాలు తీశాయని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసుల ఫిర్యాదులో సైతం మృతుని కుమార్తె పద్మ ఇదే విషయాన్ని పేర్కొన్నట్లు చెబుతున్నారు. పాతపట్నం సీఐ వినోద్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ఘటనా స్థలంలో లారీ, ద్విచక్ర వాహనం

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. నరసన్నపేట బొంతల వీధికి చెందిన డి.శివ, రమ్య దంపతులు. గత నెలలో వివాహం చేసుకున్న వీరు మంగళవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మడపాం టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి ఇసుకలారీ రోడ్డు క్రాస్ చేయడానికి షడన్‌గా తిప్పడంతో దానిని ఢీకొట్టారు. ఈ ఘటనలకు శివకు ఎడమ కాలు విరిగి పోగా, రమ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సు సిబ్బంది స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

'స్పాట్ వాల్యుయేషన్‌కు సహకరించండి'



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఈ నెల 23వ తేదీ నుంచి మొదలుకానున్న పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్)కు ఉపాధ్యాయులంతా సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ కోరారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సకాలంలో స్పాట్‌ను పూర్తి చేసి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిపే విధంగా సమన్వయంతో పనిచేద్దామని ఆమె పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పై ఫ్లోర్‌లో ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులతో డీఈఓ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ తరఫున ఉపాధ్యాయ సంఘాల నాయకుల అభిప్రాయాలను, సూచనలను డీఈఓ తీసుకున్నారు.

సీనియారిటీకి ప్రాధాన్యతనివ్వాలి: ఉపాధ్యాయ సంఘాలు స్పాట్ వాల్యుయేషన్‌లో సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. గతంలో జరిగిన లొసుగులకు అవకాశం లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని తీర్మానించారు. గర్భిణులు, దీర్ఘకాలిక సమస్యలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. అందుకు డీఈఓ సమ్మతించారు. అయితే మినహాయింపు ఉత్తర్వుల కోసం స్పాట్ కేంద్రం వద్ద విధిగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని డీఈఓ పగడాలమ్మ స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, హెచ్‌ఎంల సంఘ నాయకులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బతుకు తెరువుకు వచ్చి..

- కారు ఢీకొని తూర్పుగోదావరి జిల్లా వాసి మృతి



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా సామగ్రి

ఎచ్చెర్ల క్యాంపస్: బతుకు తెరువుకు జిల్లాకు వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా పెనుగుదూరుకు చెందిన తుమ్మలపల్లి సత్తిబాబు (43) పచ్చళ్లు, గృహ అవసరాల సామగ్రి అమ్ముతుంటాడు. కొన్నేళ్ల కిందట శ్రీకాకుళం వలస వచ్చి హయాతీనగరం సమీపంలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. మంగళవారం ఎప్పట్లాగే తన ద్విచక్ర వాహనంపై పచ్చళ్ల విక్రయానికి వెళ్తుండగా కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో జాతీయ రహదారిపై ఒడిశా నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్తిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య దుర్గా వరలక్ష్మి, కుమార్తె మల్లేశ్వరి, కుమారుడు సురేష్ ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గ్యాస్ లీక్.. సామగ్రి దగ్ధం

టెక్కలి రూరల్: స్థానిక రాచవీధిలో ఓ ఇంట్లో మంగళవారం సాయంత్రం గ్యాస్ లీకవ్వడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సకాలంలో స్పందించిన టెక్కలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. రాచవీధికి చెందిన గుడ్ల రమేష్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు రావడంతో ఇంట్లో ఉన్న దుస్తులు, వారి దుకాణం కోసం తయారు చేస్తున్న తిను బండారాలు కాలిపోయాయి. మంటలు గుర్తించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్‌ఎఫ్‌ఓ మల్లేశ్వరరావు పర్యవేక్షణలో దుర్గారావు, శ్రీనివాసరావు తదితరులు మంటలను అదుపు చేశారు.